

అర్ధరాత్రి చిందులు

- తీర ప్రాంత అతిథి గృహాల్లో రేవ్ పార్టీలు
- అమ్మాయిలతో డ్యాన్సలు.. పోలీసుల దాడులు
- అధికార పార్టీ నేతల నుంచి ఒత్తిళ్లు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని సముద్రతీర ప్రాంతంలో అతిథి గృహాల వేదికగా రేవ్ పార్టీలు జోరందుకున్నాయి. యువతను ఆకర్షించేందుకు ఇతర ప్రాంతాల నుంచి యువతులను రప్పించి అర్ధరాత్రి చిందులు వేస్తున్నారు. కొంత కాలంగా ఇటువంటి పార్టీలు సాగుతున్నాయి. సముద్ర తీర ప్రాంతంలోని తోటల్లో ఎన్నో అతిథి గృహాలు వున్నాయి. ఇవి ప్రకృతి అందాలతోపాటు చల్లదనంతో అలరారుతుంటాయి. వీటిల్లో సేద తీరేందుకు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. ఇప్పుడు ఇలాంటి అతిథి గృహాల్లో కొన్ని క్యాబరే డ్యాన్సలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. నెల క్రితం ఓ వర్గానికి చెందిన యువకులు యువతులను రప్పించి చిందులు వేశారు. పోలీసులు వెళ్లి అడ్డుకుంటే అధికార పార్టీకి చెందిన ఓ నేత ఫోన్ చేయడంతో వదిలి వెళ్లిపోయారు !. ఇది తెలుసుకున్న మరో వర్గం తర్వాత రేవ్ పార్టీ పెట్టి చిందులు వేసింది. ఇది తెలిసి అధికారులు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో వారు ఎదురు తిరిగి మొన్న వేరే వారిని విడిచిపెట్టారు కదా..! అంటూ రుసరుసలాడారు. దీంతో వారు ఏమీ చేయలేక వెనుదిరిగినట్లు సమాచారం. ఇలా తీర ప్రాంతంలో రెండు వర్గాలకు చెందిన యువకులు అర్ధరాత్రి పార్టీల్లో పోటీ పడ్డారు. ఈ పార్టీలో అధికార మండల పార్టీ అధ్యక్షుడు భాగస్వామి అవుతుండడంతో గుట్టుచప్పుడు కాకుండా క్లబ్ డ్యాన్సలు వేస్తున్నారు. ఓ వర్గం యువకులకు నియోజకవర్గంలో అధికారాన్ని చెలాయించే నేత అండ ఉంది. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు యువకులు సరదాలకు, జల్సాలకు పోతున్నారు. ఇప్పటి వరకు పశ్చిమ గోదావరి జిల్లాలో పేకాటలు జోరుగా సాగేవి. వీటిపై ప్రభుత్వం సీరియస్ కావడంతో అవి కొంత వరకు కట్టడి అయ్యాయి. తాజాగా తీర ప్రాంతంలోని ప్రైవేటు అతిథి గృహాలు రేవ్ పార్టీలకు వేదికలుగా మారడంతో పెద్ద చర్చే నడుస్తోంది.

లంచం తీసుకున్న లైన్‌మన్‌కు షాక్

- ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఏసీబీ కోర్టు తీర్పు



ఏలూరు క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):వ్యవసాయ భూమిలో వేసిన బోర్‌వెల్‌కు ఎలక్ట్రికల్ కనెక్షన్ ఇవ్వడానికి లైన్‌మన్ రూ.ఐదు వేలు లంచం తీసుకున్నట్టు నేరం రుజువు కావడంతో అతనికి ఏడాది జైలు శిక్ష, రూ.రెండు వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తీర్పుచెప్పింది. ఏలూరు జిల్లా భీమడోలు మండలం పోలసానపల్లికి చెందిన కనుకుంట మురళీకృష్ణ అతని మామ తూమాట అజయ్ కుమార్‌లకు ఉన్న వ్యవసాయ భూమిలో బోరు వెల్ వేశారు. దానికి కనెక్షన్ ఇవ్వడానికి 2010లో భీమడోలు ఎలక్ట్రికల్ ఆఫీస్‌కు చెందిన లైన్‌మెన్ డి.మాణిక్యాలరావు వారిని రూ.ఐదు వేలు లంచం డిమాండ్ చేయగా వారు ఏలూరు అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏసీబీ అధికారులు 2010 మార్చి 31న లంచం తీసుకుంటున్న మాణిక్యాలరావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు రాజమహేంద్రవరం ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ జరగ్గా మాణిక్యాలరావుపై నేరం రుజువు కావడంతో ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.రెండు వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం కోర్టు తీర్పు ఇచ్చింది.



భీమవరంలో వందేమాతరం ఆలపిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు

వందేమాతర నినాదం.. ఓ శక్తి

జిల్లా కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):'వందేమాతరం దేశ భక్తి యొక్క నినాదం మాత్రమే కాదు. అది మన మనసుల్లో దేశమంటే ఏమిటో గుర్తు చేసే శక్తి' అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఈ గేయం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం భీమవరంలో వందేమాతర గీతాలాపన జరిగింది. బంకించంద్ర చటర్జీ రచించిన ఈ గేయం స్వాతంత్ర్య ఉద్యమకారుల్లో పోరాట స్ఫూర్తిని రగిలించిందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డీఈవో నారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.గీతాబాయి, పీఎస్ఎం బాలికోన్నత పాఠశాల విద్యార్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ అంటే భయం వద్దు

క్యాన్సర్ అంటే భయపడాల్సిన పనిలేదు. ముందుగా గుర్తిస్తే పూర్తి నయం చేయగల వ్యాధి. క్యాన్సర్‌పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా శుక్రవారం క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో కలిసి భీమవరంలో ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ముందస్తు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ద్వారా నూరు శాతం నిరోధించవచ్చని అన్నారు. వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే వ్యాధి నుంచి కోలుకునే అవకాశం పెరుగుతుందన్నారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పాల్గొన్నారు.

బ్యాంకర్లు వెంటనే రుణాలు ఇవ్వాలి

పీఎం స్వ నిధి, వీవర్స్ ముద్ర, ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు బ్యాంకర్లు వెంటనే రుణాలు మంజూరు చెయ్యాలని కలెక్టర్ నాగరాణి సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి బ్యాంకు మేనేజర్లు, బ్యాంక్ కంట్రోలర్స్, మెప్మా, డీఆర్‌డీఏ, వివిధ శాఖల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పీఎం స్వనిధి కింద లబ్ధిదారులకు రుణాల మంజూరు, నిధులు విడుదలలో కొన్ని బ్యాంకుల అధికారులు తాత్సారం చేయడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. వీధి వ్యాపారుల రుణాలు మంజూరులో లబ్ధిదారుల సిబిల్ పరిశీలన మినహాయించి సొమ్ము విడుదల చేయాలన్నారు. వీవర్స్ ముద్ర రుణాల మంజూరులో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్దేశించిన లక్ష్యాలకు మించి రుణాలు అందజేయాలన్నారు. వచ్చే సమావేశం నాటికి బ్యాంకులు లబ్ధిదారులకు నూరు శాతం రుణాలు మంజూరు చేసి ప్రగతి చూపించాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్రప్రసాద్, మెప్మా పీడీ హెబ్సిబా, డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆటాడుకుందాం

క్రీడా హబ్‌గా తాడేపల్లిగూడెం

- సిమ్మింగ్ పూల్, క్రికెట్, ఇండోర్ స్టేడియం ఏర్పాటు
- జడ్పీ హైస్కూల్‌లో అత్యాధునిక వసతులతో క్రీడా మైదానాలు
- పీ4 విధానంలో అభివృద్ధి
- చురుగ్గా పనులు..



తాడేపల్లిగూడెం క్రీడాహబ్‌గా మారుతోంది. ఎన్నడూ లేని విధంగా ఇక్కడ అన్ని రకాల క్రీడలను ఆడుకునేందుకు, క్రీడాకారులను తయారుచేసి పోటీలకు సన్నద్ధం చేసేందుకు శిక్షణ ఇవ్వనున్నారు. క్రికెట్, స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియం, కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్, త్రోబాల్ ఇలా అనేక రకాల ఆటలకు కోర్టులు సిద్ధమవుతున్నాయి.

(తాడేపల్లిగూడెం-ఆంధ్రజ్యోతి):

స్విమ్మింగ్ పూల్ సిద్ధం..!

32వ వార్డు కడకట్లలో 4.68 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన సెమీ ఒలింపియాడ్ స్విమ్మింగ్ పూల్‌ను సిద్ధం చేస్తున్నారు. 90 శాతం పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. దీని పొడవు 84, వెడల్పు 44 అడుగులు. బేబీ పూల్‌గా 3.5 అడుగులు, డీప్ సైడ్‌గా 6.5 అడుగుల లోతు. పిల్లలకు, నేర్చుకునే వారికి, నేర్చుకున్న వారికి అంటూ మూడు విభాగాలుగా తీర్చిదిద్దారు. 2018లో దీని పనులు ప్రారంభించారు. కాని, తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం దీనిని పట్టించుకోక పోవడంతో పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పి4 విధానంలో దీనిని తీర్చిదిద్దారు. ఇది మరో నెల రోజుల్లో ఉపయోగంలోకి రానుంది. ఈ పూల్‌కు అనుసంధానంగా వున్న రోడ్డుకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నిధులు మంజూరు చేశారు.

జడ్పీ హైస్కూల్‌లో ఆట స్థలాలు

తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అన్ని క్రీడా విభాగాలకు చెందిన ఆట స్థలాలను రెడీ అవుతున్నాయి. ఇక్కడ విద్యార్థులను అన్ని విభాగాల్లో క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. క్రికెట్ గ్రౌండ్‌తోపాటు నెట్ క్రికెట్, కబడ్డీ, కోకో, బేస్‌బాల్, త్రోబాల్, వాలీబాల్, లాంగ్ జంప్ కోర్టులు ఏర్పాటుచేశారు. వాకింగ్ ట్రాక్‌ను పట్టణ ప్రజలకు అనువుగా తీర్చిదిద్దారు. సీసీ కెమెరాలను సమకూర్చారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో ఆడుకునేలా రూపొందించారు. హైస్కూల్ మొత్తం అండర్ గ్రౌండ్ డ్రెయిన్ వ్యవస్థను సిద్ధం చేశారు. ఇవన్నీ పీ4లో తీర్చిదిద్దుతున్నారు.

ఇండోర్ స్టేడియం

తాడేపల్లిగూడెంలో ఇండోర్ స్టేడియం పనులు చురుగ్గా సాగుతున్నాయి. దివంగత నేత, మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. పనులు ప్రారంభమైనప్పటికి ఆయన చనిపోయిన తర్వాత నిలిచిపోయాయి. ప్రభుత్వం మారడంతో మొత్తం అటకెక్కాయి. కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో పనులు జోరందుకున్నాయి. ఎమ్మెల్యే బొలిశెట్టి చొరవ తీసుకుని పనులు వేగవంతం చేశారు. ఇప్పుడు దాదాపు పూర్తి కావచ్చాయి. త్వరలోనే ప్రారంభానికి రెడీ అవుతోంది.



జడ్పీ హైస్కూల్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

క్రికెట్ స్టేడియం

ఎస్ఐటీ చేరువలో వాకర్స్ ట్రాక్ పక్కనే క్రికెట్ స్టేడియాన్ని నిర్మించాలని ఎమ్మెల్యే నిర్ణయించారు. కలెక్టర్ నాగరాణికి ఈ ప్రదేశాన్ని చూపించారు. త్వరలో ఇది కార్యరూపం దాల్చనుంది. ఇలా తాడేపల్లిగూడెం క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు అనువుగా తయారవుతోంది. క్రీడాకారులు ఆడుకునేందుకు చక్కని వాతావరణం ఏర్పడుతోంది.



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

భీమవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప సభాపతి రఘురామకృష్ణరాజు శుక్రవారం దివ్యాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. గడచిన ఆరు నెలలుగా వీటి కోసం దివ్యాంగులు ఎదురు చూస్తున్నారు. ఈ విషయం ఉప సభాపతి దృష్టికి వెళ్లడంతో ఏలూరు కలెక్టరేట్‌లోని వీటిని రప్పించి దివ్యాంగులకు అందజేశారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ట్రై సైకిళ్ల కోసం తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.25 లక్షలు మంజూరు చేశారు. అప్పటి ప్రభుత్వం వీటిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఉండి నియోజకవర్గం నుంచి ఎవరికైనా ట్రైసైకిళ్లు అవసరమైతే తమ కార్యాలయంలో సంప్రదించాలని రఘురామ సూచించారు. అందరికీ సైకిళ్లు అందజేస్తామని తెలిపారు.

ఏపీఐఐసీ పాలకవర్గంలో జిల్లా నుంచి ఇద్దరు డైరెక్టర్లు

భీమవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) డైరెక్టర్లుగా జిల్లా నుంచి ఇద్దరికి చోటు లభించింది. వీరిలో భీమవరం నుంచి చనమోలు చంద్రశేఖర్ (జనసేన), పాలకొల్లు నుంచి కడలి గోపాలరావు(టీడీపీ) ఉన్నారు.



ఎల్‌వోసీ అందజేస్తున్న రామరాజు, సీతారామలక్ష్మి

ప్రజా వేదిక సమస్యలు పరిష్కరిస్తాం

భీమవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):భీమవరం నియోజకవర్గ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి శుక్రవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వైద్య చికిత్సలు చేయించుకున్న వారు, వైద్య చికిత్స చేయించుకునే వారికి సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరవాసరానికి చెందిన కట్టా స్వాతికి క్యాన్సర్ వ్యాధి చికిత్స నిమిత్తం రెండు లక్షల 30 వేలకు ఎల్‌వోసీ అందజేశారు. కార్యక్రమంలో భీమవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు మద్దుల రాము, మండల అధ్యక్షుడు కొయ్యలగడ్డ గణపతి, కార్యదర్శి కోళ్ల సీతారాం వీరవాసరం మండల ప్రధాన కార్యదర్శి వీరవల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను మోసం చేస్తున్న ఫీడ్ కంపెనీలు



పాలకొల్లు రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):మేత ధరలు తగ్గించకుండా ఫీడ్ కంపెనీలు ఆక్వా రైతులను దగా చేస్తున్నాయని పాలకొల్లు జైభారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు ధ్వజమెత్తారు. శుక్రవారం పాలకొల్లులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 'రొయ్యల మేత కిలోకు రూ.6 తగ్గించాలని ప్రభుత్వం ఆదేశించినా ఫీడ్ కంపెనీలు తగ్గించడం లేదు. వీటిని ఆసరాగా తీసుకొని హేచరీలు, ప్రోసెసింగ్ కంపెనీలు అదేబాటలో పయనిస్తూ ఆక్వా రైతులను మోసం చేస్తున్నాయి. దీనిని ప్రభుత్వం అరికట్టాలి. భవిష్యత్తులో ఆక్వా రైతులు పంటలను విక్రయించేందుకు, రాయితీలు పొందేందుకు అప్సర ధ్రువీకరణ పత్రాలను ప్రతి ఆక్వా రైతు ఆధార్ కార్డు లింకుతో పొందాలి' అని కోరారు. సమావేశంలో సంఘం నేతలు బోనం చినబాబు, మేడిద జాన్ డేవిడ్ రాజు, సభ్యులు పాల్గొన్నారు.

బావా.. బయటకు రా..!

అంటూ స్నేహితుడిని చాకుతో పొడిచి చంపేశాడు -7లో

స్టాక్ పాయింట్ ఖాళీ..!



ఆచంట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. పలుచోట్ల అనేక నిర్మాణాలు జరుగుతుండటంతో ఇసుక ఎక్కడ ఉంటే అక్కడికే పరుగులు పెడుతున్నారు. కొన్ని నెలలుగా గోదావరికి తరచూ వరదలు వస్తుండడంతో మూడు నెలలుగా ర్యాంపులు లేకపోవడంతో జిల్లాలో పలుచోట్ల ఏర్పాటుచేసిన ఇసుక స్టాక్ పాయింట్లకు డిమాండ్ ఏర్పడింది. ఆచంట మండలం కొడమంచిలిలో 17 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ చేశారు. ఇసుక డిమాండ్‌తో ఇక్కడి స్టాక్ పాయింట్‌లో రెండు, మూడు రోజుల్లో మొత్తం ఖాళీ అయ్యే అవకాశం వుంది. కొండలా కనిపించిన ఇసుక గుట్టలు ఇప్పుడు ఖాళీగా దర్శనిస్తున్నాయి. ఈ క్రమంలో జిల్లాలో ఇసుకకు మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. డిసెంబరులో గాని ర్యాంపులు వేసే అవకాశం లేదు. దీంతో రానున్న రోజుల్లో ఇసుక డిమాండ్‌తోపాటు రేటు పెద్ద ఎత్తున పెరగడం ఖాయం.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ఇరగవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):ఉండ్రాజవరం మండలం వడ్లూరు గ్రామానికి చెందిన బాలిక, తూర్పు విప్పరుకు చెందిన కూనవల్లి శ్రీనివాస్ ప్రేమించుకున్నారు. వీరి ప్రేమను అంగీకరించి పెద్దలు పెళ్లి చేయడానికి నిశ్చయించారు. శుక్రవారం పెళ్లి జరగాల్సి ఉండగా విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు వచ్చి వివాహాన్ని అడ్డుకున్నారు. చిన్న వయసులో పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలు మేజర్లు అయిన తర్వాతే పెళ్లి చేయాలని హితవు పలికారు.

మావుళ్లమ్మ మండల దీక్ష స్వీకరణ



భీమవరం టౌన్ : మావుళ్లమ్మ మండల దీక్షలను శుక్రవారం 255 మంది భక్తులు స్వీకరించారు. తెల్లవారుజామున ఆలయ మండపం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతంలో ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యం లో భక్తులు మాలధారణ స్వీకరించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి ఆలయం వద్ద లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈవో బుద్ధా మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.

మావుళ్లమ్మ పాలకవర్గంలో మనోళ్లే



- ప్రభుత్వం నుంచి సంకేతాలు
- భీమవరం నుంచి వెళ్లిన జాబితాకు గ్రీన్‌సిగ్నల్..
- త్వరలోనే నియామకపు ప్రకటన

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

మావుళ్లమ్మ ఆలయ పాలకవర్గాన్ని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానికేతరులు కాకుండా స్థానికులకే చోటు ఇవ్వాలంటూ నియోజకవర్గ కూటమి నేతలు చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు వారు పంపించిన జాబితాపై తుది నిర్ణయం తీసుకోనుంది. మావుళ్లమ్మ దర్శనానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు ఆలయానికి విచ్చేస్తుంటారు. ఫలితంగా ఏటా ఆలయ ఆదాయం రూ.5 కోట్లకు చేరింది. రాష్ట్రంలోని రూ.5 కోట్లు ఆదాయం దాటిన ఆలయ ట్రస్ట్ బోర్డుల్లో స్థానికేతరులకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉభయగోదావరి జిల్లాల నుంచి ఈ ఆలయానికి పాలకవర్గ సభ్యులను నియమించాలని ప్రభుత్వం భావించి దరఖాస్తులు ఆహ్వానించే ప్రయత్నం చేసింది. ఎమ్మెల్యేతోపాటు కూటమి నేతలకు స్పష్టం చేసింది. మావుళ్లమ్మ ఆలయ పాలకవర్గంలో చోటు కోసం స్థానికంగా గట్టి పోటీ వుంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీలు తమకు కేటాయించిన సభ్యులతో కూడిన జాబితాను పంపారు. చైర్మన్ పదవిని జనసేనకు కేటాయించారు. జాబితా వెళ్లినా స్థానికేతరులకు అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. ఇదే తరహాలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయానికి స్థానికేతరులను సభ్యులుగా నియమించాలని భావించినా చివరకు అక్కడి వారికే అవకాశం ఇచ్చారు. భీమవ రంలోనూ కూటమి నేతలపై ఇదే రకమైన ఒత్తిడి చేయడంతో ప్రభుత్వం స్థానికులకే అవకాశం ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది.

'ఓట్ చోర్ గద్దీ ఛోడ్' విజయవంతం



కాంగ్రెస్ పార్టీ సమావేశంలో నేతలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ పిలుపు మేరకు జిల్లాలో 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' కార్యక్రమం విజయవంతమైందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమారరాజు తెలిపారు. పాలకొల్లు పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశానికి కో ఆర్డినేటర్ కె.హరికిరణ్ అధ్యక్షత వహించారు. పార్టీ విధానాలకు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. యడ్ల శివాజీ, గోగుల మండ భాస్కరరావు, మోహనరావు, భానుప్రకాష్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కార్నర్

ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో ఆటల పోటీలు


పిల్లలతో కబడ్డీ ఆడుతున్న ఐటీడీఏ పీవో రాములు

బుట్టాయగూడెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కెఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని నూతిరామన్నపాలెం, రాజానగరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలబాలికల పాఠశాలల్లో జన జాతీయ గౌరవ్ దినస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా శుక్రవారం ఆటల పోటీలను ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ ప్రారంభించారు. బాలురకు, బాలికలకు వేరు వేరుగా వాలీబాల్, కబాడ్డీ, అర్చరీ, వ్యాసరచన, జావెలిన్ త్రో, పెయింటింగ్, వక్తృత్వ పోటీలను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. 100 మంది క్రీడాకారులు పాల్గొనగా వివిధ అంశాల్లో 51 మందిని ఎంపిక చేశారు. పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు రెండు రోజులుపాటు శిక్షణ ఇచ్చి విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఎటిడబ్ల్యూవో జనార్ధనావు, ఎఎంవో కె.శిరమయ్య, డీవైఈవో కుమార్ హెచ్ ఎంలు, ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వృత్తివిద్య పోటీలకు జిల్లా విద్యార్థి బృందాల ఎంపిక


జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎస్ఎస్ఏ జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్, డీఈవో, తదితరులు

ఏలూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వివిధ వృత్తుల్లో నైపుణ్యాలపై జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు డీసీఎంఎస్ ఫంక్షన్ హాలులో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లావ్యాప్తంగా 38 ఒకేషనల్ స్కూళ్ల నుంచి విద్యార్థులు హాజరు కాగా, మొత్తం 10 రకాల వృత్తుల్లో ఆధునిక నైపుణ్యాలు, అవిష్కరణలు, అంకుర సంస్థల్లో నూతన పోకడలపై బాల,బాలికల ప్రతిభను పరీక్షించేందుకు ప్రదర్శనలు ఏర్పాటయ్యాయి. వీటినుంచి న్యాయనిర్ణేతలు ఉత్తమమైనవాటిని ఎంపికచేసి, విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. డీఈవో వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ చదువుతో పాటే వృత్తి విద్యాకోర్సుల్లో నైపుణ్యాలను సాధించడం ద్వారా స్వయం ఉపాధిని పొందడంతో పాటు, మరి కొందరికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునన్నారు. సమగ్రశిక్షా జిల్లా ఏపీసీ పంకజ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగాలతో పాటే వృత్తుల్లోకూడా నిబద్ధత, నైపుణ్యం పాటిస్తే పోటీ ప్రపంచంలోనూ ధీటుగా రాణించగలరని విద్యార్థులకు సూచించారు. జిల్లాలోని అన్ని హైస్కూళ్లలో బాలబాలికలకు వృత్తుల్లో తర్ఫీదు నిచ్చేందుకు పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లను నియమించామన్నారు. ఎస్ఎస్ఏ జీసీడీవో నవీనకుమారి మాట్లాడుతూ జిల్లా విజేతలతో ఈ నెలాఖరులోగా విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. డీఆర్డీయే ప్రాజెక్టు డైరెక్టర్ విజయరాజు, సెట్‌వెల్ సీఈవో ప్రభాకర్, ఎంఈవో అరుణ్‌కుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు, సెక్టోరల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

జిల్లా విజేతలు వీరే

రిటైల్‌రంగం వృత్తి పోటీలో యర్రగుంటపల్లి జడ్పీ హైస్కూలు విద్యార్థుల బృందం, బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్) పోటీలో పెదపాడు జడ్పీ హైస్కూలు విద్యార్థి బృందం, ఫుడ్ ప్రాసెసింగ్ పోటీలో బొర్రంపాలెం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి బృందం, బ్యూటీ అండ్ వెల్‌నెస్ పోటీలో నూజివీడు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల బృందం, హెల్త్‌కేర్ పోటీలో అడవికొలను జడ్పీహెచ్ఎస్ విద్యార్థి బృందం, అప్పారెల్ (రెడీమేడ్ దుస్తుల తయారీ) పోటీలో పెదనింద్రకొలను జడ్పీహెచ్ఎస్ విద్యార్థిబృందం, ఐటీ/ఐటీఈఎస్ పోటీలో నూజివీడు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల బృందం, ఆటోమోటివ్ పోటీలో బొమ్మిడి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిబృందం, అగ్రికల్చర్ పోటీలో కొవ్వలి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిబృందం, ఎలక్ట్రానిక్స్ పోటీలో మండవల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థి బృందం రాష్ట్రస్థాయి పోటీలకు ఏలూరు జిల్లా నుంచి ఎంపికయ్యాయి.

స్విమ్మింగ్‌లో ఏలూరు క్రీడాకారుల ప్రతిభ


కీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీవో అజీజ్

ఏలూరు రూరల్, నవంబరు 7, (ఆంధ్రజ్యోతి) : ఇటీవల గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఏలూరు విశ్వనాథ్ బర్త్రీయా స్విమ్మింగ్ పూల్ క్రీడాకారులు సత్తా చాటారు. బంగారు, వెండి పతకాలతో అదరగొట్టారు. అండర్-17 విభాగంలో మోక్ష ప్రియ బ్యాక్ స్ట్రోక్, 50, 100 మీటర్ల విభాగంలో రెండు వెండి పతకాలు, ఐఎం 200 మీటర్ల రజితం, ధనుష్ సాయి బటర్‌ఫ్లై 100, 50 మీటర్లు విభాగంలో రెండు బంగారు పథకాలు ఫ్రీస్టైల్ విభాగంలో వెండి పతకం సాధించారు. అలాగే పూర్వి బటర్‌ఫ్లై విభాగంలో బంగారు పతకం, అయ్యం 200 మీటర్లు బంగారు పతకం, ఫ్రీస్టైల్ విభాగంలో రజిత పతకం సాధించింది. క్రీడాకారులను, స్విమ్మింగ్ కోచ్‌లను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్‌ఏ అజీజ్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీలకు మోగల్లు విద్యార్థి



పాలకోడేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి స్కూల్ గేమ్ పోటీల్లో నిర్వహించిన రన్నింగ్ రేస్‌లో మొదటి స్థానం గెలుచుకుని తమ విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మోగల్లు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ హైస్కూల్ పాఠశాల హెచ్‌ఎం త్రినాథులు తెలిపారు. పదవ తరగతి చదువుతున్న ఎస్.ధరణి పెదవేగిలో శుక్రవారం జరిగిన పోటీల్లో మూడు కిలోమీటర్ల రన్నింగ్ రేసులో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ పీడీ సూర్య, కోచ్ వెంకటేష్‌ను సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి, విద్యాకమిటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, గ్రామ పెద్దలు అభినందించారు.

నెట్‌బాల్ పోటీలకు సీఎస్ఎన్ కళాశాల విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సలీంఖాన్

భీమవరం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భీమవరం డాక్టర్ సీఎస్ఎన్ జూనియర్ కళాశాల నుండి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడలోని పటమట హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో 8వ తేదీ నుండి జరగనున్న 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 నెట్ బాల్ బాలబాలికల పోటీలకు తమ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని డాక్టర్ సీఎస్ఎన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండి సలీం ఖాన్ తెలిపారు. బాలుర విభాగంలో ఎన్. విలియం, జి.త్రినాథ్, స్టాండ్ బై డి.దేవ్ ఎంపికవగా బాలికల విభాగంలో ఎం.ఎస్తేరు, పి.స్వాతిలు స్టాండ్ బై జీవన లక్ష్మీ తులసిలు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎండి. సలీంఖాన్ తెలిపారు. ఇటీవల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్-17 బాలబాలికల నెట్ బాల్ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ దావూద్ ఖాన్ తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, ట్రెజరర్ వడుపు గోపి, అధ్యాపకులు,సిబ్బంది అభినందించారు.

అథ్లెటిక్స్ స్టేట్‌మీట్ పరుగు పోటీకి దొరబాబు


స్కూలు హెచ్‌ఎంతో దొరబాబు

ఏలూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వినుకొండ (పల్నాడు జిల్లా)లో ఈ నెల 22, 23 తేదీల్లో జరుగునున్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్ 200 మీటర్లు, 400 మీటర్ల రన్నింగ్ పోటీకి ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలు పదో తరగతి విద్యార్థి ఎం.దొరబాబు జిల్లా నుంచి ఎంపికయ్యాడు. జిల్లాస్థాయి ఎంపికల పోటీ ఈ నెల 5న పెదవేగిలో జరిగిందని స్కూలు హెచ్‌ఎం పి.కుటుంబరావు, సెకండ్ అసిస్టెంట్ హెచ్‌ఎం కె.వి.షడ్రక్ తెలిపారు. దొరబాబుని స్కూలు వ్యాయామోపాధ్యాయులు ఎన్.లీలా కుమారి, జె.సుబిత్ అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో అనాకోడేరు విద్యార్థి ప్రతిభ

భీమవరం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనాకోడేరులోని డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అండర్-17 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్టు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సూర్య భగవాన్‌రాజు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎస్.నెహెమ్యా కొవ్వూరులో జరిగిన అండర్-17 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఆడి తృతీయ స్థానంలో నిలిచాడన్నారు. ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మారంపల్లికి వెళ్లేదెలా ?


రైల్వే లైన్ విస్తరణలో పోయే దారి ఇదే..

దశాబ్దాలుగా రైల్వే రోడ్డే దిక్కు

రైల్వే లైన్ విస్తరణతో రహదారి మాయం

ఆందోళనలో గ్రామస్థులు

కొత్తమార్గం వేస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి హామీ

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా అంటే ఎంతో సంపన్న జిల్లాగా పేరు. అబివృద్ధి చెందిన జిల్లాగా ఖ్యాతి గడించింది. గ్రామాలకు మౌలిక వసతుల కల్పనలోనూ ముందే ఉంటుంది. అయితే ఇప్పటికీ రహదారి లేని గ్రామం ఉందంటే పైకి కిందికీ చూస్తాం. కానీ తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఇటువంటి గ్రామం ఉందంటే ఆశ్చర్యపోక తప్పదు. ఇప్పటి వరకూ రైల్వే అప్రోచ్ పుంతనే తమ మార్గంగా గ్రామస్థులు కాలం నెట్టుకొచ్చారు. కానీ ప్రస్తుతం ఆ రైల్వేలైన్ విస్తరణ పనుల్లో ఆ రోడ్డు మాయం కానుండటంతో ఆ గ్రామస్థులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోనున్నాయి. తాడేపల్లి గూడెం మండలం మారంపల్లి గ్రామానికి వెళ్లాలంటే తొలినాళ్లలో పంట పుంతల మధ్య నడుచుకుంటూ వెళ్లేవారు. అంతటా రోడ్లు పడినా ఈ గ్రామానికి సొంత దారి లేక ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ఈ గ్రామాన్ని ఆర్టీసి బస్సు కన్నెత్తి చూసింది లేదు. తాడేపల్లిగూడెం పట్టణానికి 12 కిలోమీటర్లు, తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు 8 కిలో మీటర్ల దూరంలోనే ఈ గ్రామం ఉంటుంది. ఇప్పుడు ఈ గ్రామానికి సొంత రోడ్డు వేసేందుకు తాను బాధ్యత తీసుకుంటానని చెప్పిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పైనే ఆ గ్రామస్థులు కొండంత ఆశలు పెట్టుకున్నారు.


నూతన మార్గం కోసం ప్రతిపాదిత ప్రాంతం

గ్రామం పరిస్థితి ఇదీ..

తాడేపల్లిగూడెం మండలంలో ఉండే సంపన్న గ్రామాల్లో ఒకటైన ఈ గ్రామం మూడు వందలఏళ్ల క్రితమే ఏర్పడింది. ఈ గ్రామం జగన్నాధపురం శివారు గ్రామంగా ఉండేది. అయితే 60 ఏళ్ల క్రితం ఈ గ్రామానికి పంచాయితీ హోదా కల్పించారు. ఈ గ్రామానికి అనుకుని ఎర్రకాలువ ఉండటంతో వర్షాకాలం వచ్చిదంటే వరదలకు గ్రామం చుట్టూ వరదనీరు చేరి ఒక దీవిలా మారుతుంది. ఈ గ్రామానికి మార్గం దశాబ్ధాల కాలంగా ప్రజలకు తీరని కోరికగా మారింది. తాజాగా గ్రామానికి ఉపయోగించే దారిని రైల్వేలైన్ విస్తరణ జరుగుతుందని అధికారులు కొలతలు కొలుస్తుండటంతో తమకు బయటకు వెళ్లే మార్గమే లేకుండా పోతుందని ఆందోళనలో మునిగిపోయారు.

ఎమ్మెల్యే బొలిశెట్టి భరోసా..

ఈ గ్రామానికి మెరుగైన రోడ్డుమార్గం ఏర్పాటు చేసే బాధ్యత తీసుకుంటానని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గ్రామంలో నిర్వహించిన జనసేన గ్రామ సభలో హామీ ఇచ్చారు. దాతలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రోడ్డు నిర్మాణానికి దాతల సహకారం కోరుతూ గ్రామంలో కమిటీ కూడా వేశారు. రోడ్డు నిర్మాణం ఎప్పుడు జరుగుతుందో .. తమ కోరిక ఎప్పుడు తీరుతుందో అని గ్రామస్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఊహ తెలిసినప్పటి నుంచి ఇదే దారి



మా గ్రామానికి ఊహ తెలిసి నాటి నుంచి దారిలేదు. రైల్వే మార్గంలోనే పయనిస్తున్నాం.ఎంత మంది పాలకులు మారినా మా సమస్య తీరడం లేదు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లాం. పరిష్కారం అవుతుందని బలంగా నమ్ముతున్నాం.

- తోట సూర్యనారాయణ, జనసేన కన్వీనర్ మారంపల్లి

పార్టీలకతీతంగా సహకారం



మా గ్రామానికి పూర్వీకుల నాటి నుంచి ఇదే పరిస్థితి. ప్రజలకు ఈ రోడ్డు తీరని సమస్య. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ రోడ్డు నిర్మాణ బాధ్యత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తీసుకున్నారు. దీనికి పార్టీలకతీతంగా అందరి సహకారం ఉంటుంది.

- సరిపల్లె చిట్టిబాబు, ఉపసర్పంచ్ మారంపల్లి

నడుచుకుంటూ వెళ్లాల్సిందే



మా గ్రామంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా తాడేపల్లిగూడెం కానీ నిడదవోలు కాని వెళ్లాల్సిన పరిస్థితి. పిల్లలు చదువుకునేందుకు వెళ్లాలంటే రెండున్నర కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిందే, ఇంట్లో మోటారుసైకిల్ లేకపోతే గ్రామంలో వారి పరిస్థితి మరీ దయనీయం. నేను కూడా చిన్నప్పుడు ఎంతో నరకం అనుభవించాను.

-ఎం.దుర్గాప్రసాద్, గ్రామస్థుడు

తణుకు రైల్వేస్టేషన్ రోడ్డుకు మోక్షం

మున్సిపల్ నిధులు రూ.కోటీ 40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చొరవ

తణుకు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తణుకు రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రయాణం నరకమే. అడుగడుగునా గోతులు. రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి అధ్వాన్నంగా ఉంది. గతంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ గోతులు పూడ్చించారు. వర్షాలకు గోతుల మయంగా తయారైంది. దీంతో రైల్వే స్టేషన్‌కు వెళ్ళే ప్రయాణికులతో పాటు బ్యాంకు కాలనీకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రోడ్డులో అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వే స్టేషన్‌కు రద్దీ పెరిగింది. రోజూ 24 రైళ్ల తణుకు స్టేషన్ మీదుగా రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. స్టేషన్‌కు వచ్చి వెళ్తువారు చాలా ఏళ్లగా ఇబ్బందులు పడుతున్నారు. గోతులమయంగా ఉన్న స్టేషన్ రోడ్డుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చొరవతో మున్సిపల్ నిధులు కోటీ 40 లక్షలు మంజూరు చేశారు. మున్సిపల్ నిధులుతో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. 10 తేదీ సోమవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు మున్సిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వర్‌రెడ్డి తెలిపారు.


గోతులమయంగా ఉన్న రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు (ఫైల్)

సంప్రదాయ కళకు ప్రాణం



ఆధ్యాత్మిక సేవలో గణపవరం కోలాట బృందాలు

35 గ్రూపులకు శిక్షణ

సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు కృషి

గణపవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోలాటం ప్రాచీనకళ.. రెండు కర్రలు చేత పట్టుకుని పదం పాడుతూ గుండ్రంగా తిరుగుతూ చేసే కోలాట నృత్యాలు ప్రతీపల్లెల్లో దర్శనమిచ్చేవి. రాను రాను ఆ కళ కనుమరుగవుతోంది. ముఖ్యంగా భావితరాలకు కోలాటం అంటే తెలియని పరిస్థితి వచ్చేసింది. హిందూ ధార్మికతను బతికించాలని కొందరు వ్యక్తులు చేసే కృషితో మళ్లీ ఆ కళ జీవం పోసుకుంటున్నది. గృహిణులు ఇళ్లకే పరిమితం కాకుండా కోలాటం, నృత్యం వైపు మళ్లుతున్నారు. దీని ద్వారా మానసికంగా, శారీరకంగా కొంత విశ్రాంతి పొందుతున్నట్లు తెలిపారు. కోలాటం అంటే చేతిలో చిడతలు, కాళ్లకు గజ్జలు కట్టుకుని నోటితో పాటలు పాడటం ద్వారా శారీరంలోని నవనాడులకు పని కల్పించినట్లు అవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

బాలికలతో పాటు గృహిణులు

గణపవరం మండలంలో దాదాపు 35 గ్రూపులతో బాల, బాలికలతో పాటు గృహిణులు శిక్షణ పొందుతున్నారు. తిరుమల తిరుపతి దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో గణపవరానికి చెందిన కోలాట నృత్య శిక్షకుడు కొప్పినేటి సూర్య వీరికి తర్ఫీదునిచ్చారు. కోలాటంలో హారతి, జడా, శ్రీకృష్ణుడు, పాము మెలికలు, బిందెలతో నృత్యం వంటి 25 రకాల నృత్యాలు ఇక్కడ బృంద సభ్యులు నేర్చుకున్నారు. వేసవి సెలవులతో పాటు మిగతా రోజుల్లో వారానికి రెండురోజుల పాటు శిక్షణ పొందారు. అలాగే ఈ బృందాలు గజ్జికట్టి ప్రదర్శనలు ఇస్తున్నారు. వినాయకచవితి, విజయదశమి, ప్రస్తుతం కార్తీకమాసంలో కోలాట బృందాలు ప్రదర్శనలు ఇస్తున్నారు. అలాగే ఈ బృందాలు తిరుమల బ్రహ్మోత్సవాల్లో కూడా పాల్గొన్నారు.

మానసిక, శారీరక ఉల్లాసం



ప్రతీరోజు కోలాట సాధన చేస్తే మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతో ఉపయోగం. రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. బృందసభ్యులతో కలిసి కోలాటం ప్రదర్శించడం వలన ఒత్తిడి దూరమవుతుంది. గత పదేళ్లగా కోలాట ప్రదర్శనలు ఇస్తున్నాను. కోలాటం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణకు దోహదపడే అవకాశం ఉంది.

బోను జ్యోతిస్వరూప, గణపవరం


శిక్షణ పొందిన చిన్నారులు

కళకు ప్రాచీన వైభవం తీసుకురావాలి



ప్రాచీన సంప్రదాయ కళ అయిన కోలాటానికి పూర్వవైభవం రావాలి. దీనికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలి. కోలాట ప్రదర్శనలతో మానసిక, శారీరక ఉత్సాహం లభిస్తుంది. కోలాటం నేర్చుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. టీవీలకు, ఫోన్లకు అలవాటు పడిపోకుండా ఆధ్యాత్మికత వైపు దృష్టి మల్లించేందుకు ఈ కోలాట నృత్య ప్రదర్శన ఒక సాధనగా ఉపయోగపడింది.

బొబ్బిలి ఏసురాణి, బావాయిపాలెం

తిరుమల ప్రదర్శనలో పాల్గొన్నా



తిరుమల తిరుపతి స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నాను. స్థానిక కనకదుర్గమ్మ ఆలయంలో ప్రతీ శుక్రవారం 20 మంది కోలాట బృందంతో నృత్యం చేస్తాం. కోలాటం వల్ల శారీరంలోని అన్ని నరాలు పని చేస్తాయి. రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. బీపీ, సుగర్ దరిచేరవు.

- గాజుల హైమావతి, చినరామచంద్రాపురం

హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి



హిందూ ధర్మాన్ని పరిరక్షించాలన్నదే నా ముఖ్య లక్ష్యం. తిరుమల తిరుపతి ఆధ్వర్యంలో దాస సాహిత్య ప్రాజెక్టు ద్వారా ఉచితంగా ఈ కోలాట నృత్య బృందాలను తయారు చేస్తున్నా. ఇప్పటి వరకు గణపవరం మండలంలోనే 30 బృందాలు తయారయ్యాయి. వీరికి కోలాట నృత్యాలతో పాటు సంకీర్తనలు కూడా నేర్పిస్తూ సంస్కృతి పరిరక్షణకు శ్రమిస్తున్నాం.

- కొప్పినేటి సూర్య, కోలాట నృత్య శిక్షకుడు, గణపవరం


శ్రీవారి ఆలయానికి ఇరుముళ్లు సమర్పించేందుకు వచ్చిన వృద్ధురాలు

ఎనిమిది పదుల వయసులో దీక్ష

ద్వారకాతిరుమల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వయసు కేవలం అంకెలకే పరిమితం అని నిరూపిస్తున్నారు ఈ బామ్మ... ఎనిమిది పదుల వయసులోనూ కఠోర దీక్షలు చేపట్టి తన భక్తిప్రపత్తులను చాటుతున్నారు. ఒంగోలు కు చెందిన నీలంరాజు సీతమ్మ కొన్నాళ్లక్రితం వేంకటేశ్వరస్వామి దీక్షను స్వీకరించి తన కుటుంబసభ్యులతో కలసి ద్వారకాతిరుమలకు వచ్చి శుక్రవారం ఇరుముడులు సమర్పించారు.


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

కనీస వయసు లేకుండా చేసే వివాహంతో అనర్థాలు

పెదవేగి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కనీస వయసు లేకుండా వివాహం చేస్తే వారి ఆరోగ్యంపై పెనుప్రభావం చూపి, అనర్థాలకు కారణమవుతుందని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో పెదవేగి మండలం విజయరాయిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, బాలల హక్కులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ బాల్య వివాహ వ్యవస్థ ఒక దురాచారమని ఇలాంటి సంఘటనలు ఎదురైతే 1098 నంబర్, జిల్లా న్యాయ సేవాధికారసంస్థ టోల్‌ఫ్రీ నంబర్ 15100కు సమాచారం అందించాలని సూచించారు. ట్రైనీ మాస్టర్ పి.రత్నరాజు, చైల్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ రవి, హెచ్‌ఎం ఎం.వెంకటరమణ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

శబరిమలైకు ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వాముల సౌకర్యార్థం శబరిమలై వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే శాఖ 60 ప్రత్యేక రైళ్ళను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైళ్ళు జనవరి 21వ తేదీ వరకు నడుపుతున్నట్లు ప్రకటించారు.

07101 మచిలీపట్టణం - కొల్లాం (గూడురు, రేణిగుంట) ప్రతి శుక్రవారం
07102 కొల్లాం - మచిలీపట్టణం (రేణిగుంట, గూడూరు) ప్రతి ఆదివారం
07103 మచిలీపట్టణం-కొల్లాం (గుంటూరు, కడప, రేణిగుంట) శుక్రవారం
07104 కొల్లాం-మచిలీపట్టణం (రేణిగుంట, కడప, నంద్యాల, గుంటూరు) ఆదివారం
07105 నర్సాపురం-కొల్లాం (విజయవాడ, గూడూరు,రేణిగుంట)ప్రతి ఆదివారం
07106 కొల్లాం-నర్సాపురం (రేణిగుంట,గూడూరు,విజయవాడ) మంగళవారం
07107 చర్లపల్లి -కొల్లాం (గుంటూరు, గూడూరు, రేణిగుంట) సోమవారం
07108కొల్లాం-చర్లపల్లి (రేణిగుంట, గూడూరు, గుంటూరు,పగిడిపల్లి) బుధవారం

రెండు రైళ్లు రద్దు

ఏలూరు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) :తిరుపతి నుంచి అనకాపల్లి ఆదివారం నడుస్తున్న ప్రత్యేక రైలు 07481ని ఈనెల 9,16,23, 30 తేదీలలో రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. అనకాపల్లి నుంచి తిరుపతి ప్రతి సోమవారం నడుపుతున్న రైల్ నెంబర్ 07482 ఈనెల 10, 17, 24 డిసెంబర్ 1వ తేదీన రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు.



నార్వే అధికారులతో ఎంపీ మహేశ్

రాష్ట్రానికి రండి..ఆక్వా పరిశ్రమ పరిశీలించండి

నార్వే ప్రతినిధులకు ఎంపీ మహేశ్ ఆహ్వానం

ఏలూరు టూటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి వచ్చి ఇక్కడ ఆక్వా పరిశ్రమతో కలిసి పని చేయాలని నార్వే సీఫుడ్ కౌన్సిల్ సభ్యులకు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ఆహ్వానించారు. నార్వే పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం నార్వే సీఫుడ్ కౌన్సిల్ ప్రధాన కార్యలయాన్ని సందర్శించారు. నార్వేలో ఆక్వా రంగాభివృద్ధి, సముద్ర ఆధారిత ఉత్పత్తుల వ్యాపారం లాభదాయకంగా ఎలా నడిపిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రంగాభివృద్ధికి ఎంతో అవకాశం ఉందని మా రాష్ట్రానికి వచ్చి ఆక్వా రంగాన్ని పరిశీలించాలని అక్కడ అధికారులకు తెలియజేశారు. దేశంలో అత్యధిక తీరప్రాంతం ఉన్న ప్రదేశం ఆంధ్రప్రదేశ్ అని, ఇక్కడ ఆక్వా రంగాభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయని వివరించారు.

సీసీటీవీ, స్మోక్ డిటెక్టివ్ మీద ఉచిత శిక్షణ

పెదపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) :యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ నందు గ్రామీణ ప్రాంత స్త్రీపురుషులకు ఉచితంగా సీసీటీవీ, సెక్యూరిటీ అలారం, స్మోక్ డిటెక్టివ్ (13 రోజులు) సెల్‌ఫోన్ రిపేర్స్ (30 రోజులు) మీద ఉచిత శిక్షణను అంద జేస్తున్నట్లుగా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఉచిత శిక్షణలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసు కోవచ్చునన్నారు. శిక్షణా కాలంలో ఉచితంగా భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తిగలవారు 99485 65256, 90140 40780 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చిత్రలేఖనంలో జడ్పీ విద్యార్థుల ప్రతిభ

ఏలూరు రూరల్, నవంబరు 7, (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో శనివారపుపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇటీవల రోటరీ క్లబ్ పీస్ నినాదంపై పోటీలు నిర్వహించింది. పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు పాల్గొనగా 8వ తరగతి విద్యార్థిని సీహెచ్ వైష్ణవి ప్రథమ స్థానం సాధించింది. విద్యార్థులకు మెరిట్ అవార్డు సర్టిఫికెట్లు లభించాయి. డ్రాయింగ్ టీచర్ రజనీకాంత్, విజేతలుగా నిలిచిన విద్యార్థులను క్లబ్బు సభ్యులు బహుమతులు అందించి అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం ప్రకాశరావు,ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

దోపిడీ దొంగలు దొరికారు

రూ. 7 లక్షల విలువైన సొత్తు స్వాధీనం


బైక్ పోగొట్టుకున్న బాధితునికి తాళాలు అందజేస్తున్న ఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దారిదోపిడీ, బైక్ చోరీలకు పాల్పడుతున్న నలుగురు బాల నేరస్తులతో పాటు ఒక యువకుడిని శుక్రవారం ఉదయం అరెస్టు చేసి వారి నుంచి మొత్తం 7 లక్షల పది వేల రూపాయల విలువ గల వస్తువులు స్వాధీనం చేసు కున్నట్లు ఏలూరు ఎస్పీ కేపీఎస్ కిషోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. లింగ పాలెం మండలం కళ్ళచెరువు గ్రామంలో ఉన్న ఒక వైన్‌షాపులో గుమస్తాగా గుడివాక అంజనేయ ప్రసాద్ పని చేస్తున్నారు. ఈఏడాది అక్టోబర్ 28వ తేదీ రాత్రి షాపు కట్టివేసిన అనంతరం 40 వేల రూపాయల నగదు తీసుకుని మోటారు సైకిల్‌పై ఏలూరు వస్తున్నారు. ఏలూరు - జంగారెడ్డిగూడెం రోడ్డు మార్గమధ్యలో దెందులూరు మండలం గంగన్నగూడెం వద్ద సాయి పబ్లిక్ స్కూలు ఎదురుగా అకస్మాత్తుగా రెండు మోటారు సైకిళ్ళపై ఐదుగురు యువకులు ఆయనను అడ్డగించి కర్రలతో తలపై కొట్టి రూ.40 వేల నగదు తీసుకుని పరారయ్యారు. ఈ సంఘటనపై దెందులూరు పోలీసులు కేసు నమోదు చేయగా జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు నూజివీడు డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో పెదవేగి సీఐ రాజశేఖర్ టెక్నాలజీ ద్వారా సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ఏలూరు -జంగారెడ్డిగూడెం రోడ్డులోని సోమవరప్పాడు బ్రిడ్జికింద ఐదుగురు యువకులు అనుమానాస్పదంగా ఉండడంతో వారిని అదుపులోకి తీసు కున్నారు. నలుగురు బాల నేరస్తులతో పాటు ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ చెంచుల కాలనీకి చెందిన బంగారు సుబ్ర హ్మణ్యంను (21) అరెస్టు చేశారు. వీరు మోటారు సైకిల్ దొంగతనాలకు పాల్పడి ఆ మోటారు సైకిళ్లను ఉపయోగించి ఇళ్ళ దొంగతనాలు, దారి దోపిడీలకు పాల్పడుతున్నారని ఎస్పీ వెల్లడించారు. వీరి నుంచి 9 మోటారు సైకిళ్ళు, 10 వేల రూపాయల నగదు, మొత్తం విలువ 7 లక్షల పది వేల రూపాయల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. చాకచక్యంగా వ్యవహరించిన క్రైంపార్టీ సిబ్బందికి పెదవేగి సీఐ ల్యాప్ టాప్‌ను బహుమతిగా సమకూర్చగా దానిని ఎస్పీ అందజేసి అభినందించారు. పోలీసు అధికారులందరికీ ప్రశంసాపత్రాలను అందించారు. అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, నూజివీడు డీఎస్పీ ప్రసాద్, పెదవేగి ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

పెద్ద నోట్ల రద్దుకు.. పదేళ్లు



- ఆశించిన స్థాయిలో జరగని నల్లధనం నిర్మూలన
- బ్యాంకులకు ముద్రణ భారం
- పడిపోయిన జీడీపీ
- ఊరటనిచ్చిన నగదు రహిత లావాదేవీల పెరుగుదల

మన దేశంలో పెద్ద నోట్లు రద్దయి పదేళ్లు అయింది. 2016 నవంబరు 8వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటనతో దేశ వ్యాప్తంగా నగదు లావాదేవీలపై తీవ్ర ప్రభావం ఏర్పడింది. దేశంలో చెలామణిలో వున్న రూ. 500, రూ. 1000 నోట్లను రద్దు చేయడం ద్వారా దేశంలో నల్లధనం నిల్వలను తగ్గించడం, నకిలీ కరెన్సీ నిర్మూలన, నగదు రహిత ఆర్థిక లావాదేవీలను ప్రోత్సహించడం వంటి లక్ష్యాల కోసం పెద్ద నోట్లను ప్రభుత్వం రద్దు చేసింది.


బ్యాంక్ ముందు బారులు తీరిన ఖాతాదారులు (ఫైల్)

(తణుకు రూరల్-ఆంధ్రజ్యోతి)

పెద్ద నోట్ల రద్దు ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు సామాజిక, పారిశ్రామిక రంగాలపై ఎంతో ప్రభావం చూపింది. దేశంలో ఆర్థిక వ్యవస్థను ఆధునీకరించేందుకు చేపట్టిన ఈ ప్రక్రియలో సుమారు 6 నెలల పాటు నగదు ప్రవాహం తగ్గిపోయి సామాన్యుల నుంచి ఉద్యోగులు, పారిశ్రామికవేత్తల వరకూ అనేక ఇబ్బందులెదుర్కొన్నారు. సుమారు నెల రోజుల పాటు బ్యాంక్‌లు తమ కార్యకలాపాలన్నీ ప్రజల వద్ద ఉన్న పెద్ద నోట్లను సేకరించడానికి, సేకరించిన నగదును కట్టుదిట్టమైన భద్రత మధ్య పూలింగ్ స్టేషన్‌లకు తరలించడమే పనిగా వుండేది. అప్పటి వరకూ 74 శాతం చలామణిలో ఉన్న రూ. 1000 నోట్లు ప్రకటన తర్వాత 107 శాతం చలామణి పెరిగిపోయింది. ప్రజలు తమ వద్ద వున్న రూ. 500, 1000 నోట్లను బ్యాంకుల వద్ద బారులు తీరి మరీ జమ చేశారు. వీటితో పాటు తమకు కావలసిన నగదు కోసం బ్యాంక్‌ల ఎదుట బారులు తీరారు. ఈ కాలంలో ప్రజలు తమ వైద్య అవసరాల కోసం, శుభకార్యాల ఖర్చులకు నగదు కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లాలో సుమారు 1500 పైగా వివిధ బ్యాంక్ బ్రాంచీల ద్వారా రోజూ సుమారు రూ. 10,000 కోట్ల నుంచి 12,000 కోట్ల వరకూ పెద్ద నోట్లను బ్యాంక్‌లలో జమ చేసేవారు.

నగదు కోసం పడిగాపులు...

కొత్తగా ప్రవేశపెట్టిన రూ. 500, రూ. 2000 నోట్లను పొందడం కోసం బ్యాంక్‌ల ముందు గంటల తరబడి ప్రజలు నిరీక్షించేవారు. బ్యాంక్‌లు మొదట ఖాతా ఉన్న ఒక వ్యక్తికి రూ. 2,500 ఇవ్వడం ప్రారంభించాయి. ఇలా ఇచ్చిన రూ. 2000 నోటుకు చిల్లర కోసం కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నోట్ల రద్దు తర్వాత ఏటీఎంలలో సరిగా నగదు నిల్వలు లేకపోవడంతో నగదు కోసం ఏటీఎంల వద్ద భారీ లైన్‌లలో నిలబడలేక అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. సరిగ్గా ఇలాంటి సమయంలోనే నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు ఆన్‌లైన్ చెల్లింపులను చేపట్టడం జరిగింది. ఆర్థిక వ్యవస్థలో నగదు లావాదేవీల స్థానంలో ఆన్‌లైన్ చెల్లింపుల ప్రక్రియ ద్వారా ఆర్థిక అవసరాలు తీర్చడంలో నగదు నిల్వల పాత్ర తగ్గినప్పటికీ ఆన్‌లైన్ మోసాల కారణంగా ఆర్థికంగా నష్టపోవడం జరుగుతోంది.



మంచే జరిగింది

పెద్ద నోట్ల రద్దు వల్ల ప్రజలు ఇబ్బందులు పడటం వాస్తవమే అయినప్పటికీ తర్వాత వచ్చిన మార్పులతో చిన్న వ్యాపారులకు, వినియోగదారులకు మేలు జరిగింది. నగదు కొరత వల్ల కొత్తగా వచ్చిన ఆన్‌లైన్, యూపీఐ చెల్లింపుల విధానంతో వ్యాపారాలు సులభతరమయ్యాయి. చిన్న వ్యాపారుల్లో ఎక్కువ శాతం నిరక్షరాశ్యులు కావడంతో ఇబ్బందులు వచ్చినా క్రమేణా ఆర్థిక లావాదేవీలన్నీ సులభంగాను, సురక్షితంగా మారిపోయాయి. గతంలో 75 శాతం ఆర్థిక వ్యవహారాలన్నీ నగదును లెక్కించడంలోనే సమయం వృధాగా పోయేది. ఇప్పుడు యూపీఐ ద్వారా వ్యాపారాలన్నీ సురక్షితంగా, నగదు రహితంగా మారిపోయాయి.

-గమిని రాంబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు, తణుకు.



ఉపద్రవాలే ఎక్కువ...

పెద్ద నోట్ల రద్దు ఉద్దేశం మంచిదే కానీ ఉపద్రవాలే ఎక్కువగా జరిగాయి. ఆశించిన స్థాయిలో నల్లధనం నిర్మూలన జరగలేదు. నకిలీ నోట్ల చలామణి ఆగలేదు. రద్దైన కరెన్సీ 15.41 లక్షల కోట్ల నోట్లు కాగా వెనక్కి వచ్చింది 15.03 లక్షల కోట్లు. అంటే 99 శాతం వెనక్కి వచ్చింది. ఈ కారణంగా జమైన నోట్లకు సమానంగా కొత్త నోట్లను జారీ చేయడానికి బ్యాంక్‌లు ప్రయాస పడవలసి పరిస్థితి ఏర్పడింది. కరెన్సీ ముద్రణ భారం బ్యాంక్‌లపై పడింది. 2015-16లో 8 శాతం ఉన్న దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 2016-17లో 5 శాతానికి పడిపోయింది. అసంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలు, ఉన్న ఉపాధి తగ్గిపోయింది.

-డాక్టర్ జే. చంద్రప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఆర్థికవేత్త, తణుకు.

నిత్యావసరాల ధరలు నియంత్రించాలి

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకుల ధరలు నియంత్రించాలని, ప్రజాపంపిణీ ద్వారా 14 రకాల సరుకులు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ భూమి, ఉపాధి హామీ, ఇళ్ళ స్థలాలు, పామాయిల్ కార్మికులు, నర్సరీ కార్మికులు, ఆక్వా కార్మికుల సమస్యలపై రానున్న మూడేళ్ల కాలంలో ఉద్యమాలకు, పోరాటాలకు 32వ మహాసభ నాంది అవుతుందని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో టి.నర్సాపురం మండలంలో 32వ మహాసభలు నిర్వహించామని చెప్పారు. నూతన కార్యవర్గాన్ని 31 మందితో ఏకగ్రీవంగా మహాసభ ప్రతినిధులు ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎస్.కోటేశ్వరరావును జిల్లా కమిటీ శాశ్వత ఆహ్వానితునిగా ఎన్నుకున్నామని, 10 తీర్మానాలకు మహాసభ ఆమోదం తెలిపిందన్నారు. పాలకులు భూ పంపకంపై ఆలోచించలేదని దుయ్యబట్టారు.


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు


మత్స్యశాఖ జేసీతో వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఆక్వా రైతుల అభివృద్ధికి

సహకారం అందించండి : కలెక్టర్

భీమవరం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆక్వా రైతుల అభివృద్ధికి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. శుక్రవారం న్యూఢిల్లీ నుంచి కేంద్ర మత్స్యశాఖ జాయింట్ సెక్రటరీ నీతుకుమారి ప్రసాద్ జిల్లా కలెక్టర్లు, మత్స్యశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, భీమవరం మండలాల్లో బ్రాకిష్ వాటర్ ఆక్వా సాగు జరుగుతోందన్నారు. జిల్లాలో ఉన్న ఆక్వా రైతులకు కల్పించవలసిన మౌలిక సదు పాయాలపై వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్ఎల్ఎన్ రాజు, ఏడీ సీహెచ్. రాంబాబు, ఎఫ్డీవో బి.శరత్, డీపీఎం ఎం.నరేష్ తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న రహదారులపై సమీక్షిస్తున్న జడ్పీ చైర్మన్ పద్మశ్రీ

రహదారుల మరమ్మతులు చేపట్టండి: పద్మశ్రీ

ఏలూరు సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల జిల్లాలోని అనేక గ్రామీణ రహదారులు తీవ్రంగా దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. తుఫాన్‌కు దెబ్బతిన్న రహదారులపై శుక్రవారం జడ్పీ కార్యాలయంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమీక్షించారు. అధికారులు ప్రతి మండల స్థాయిలో రోడ్ల నష్టం వివరాలను సేకరించి, అత్యవసర మార్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గుంతలు పూడ్చటం, డ్రెయినేజి శుభ్రపరచటం, నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, తదుపరి దశలో నష్టానికి సంబంధించిన అంచనాలను సిద్ధం చేసి మైనర్ రిపేర్లకు జిల్లా పరిషత్‌కు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. జడ్పీ సీఈఓ ఎం. శ్రీహరి, డిప్యూటీ సీఈఓ కె. భీమేశ్వర్, పంచాయతీరాజ్ ఎస్ఈ రమేష్, ఈఈలు, డీఈలు, అన్ని మండలాల ఏఈలు పాల్గొన్నారు.

దేవదాయ, ధర్మదాయ శాఖలో పదోన్నతులు

భీమవరం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మదాయ శాఖలో పలు ఆలయాల్లో పనిచేస్తున్న థర్డ్ గ్రేడ్ ఈవోలకు సెకండ్ గ్రేడ్ ఈవోలుగా పదోన్నతి లభించింది. జోన్-2 పరిధిలో 13 మందికి పదోన్నతి రాగా పశ్చిమ నుంచి 7 గురికి లభించింది. కృష్ణా, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో గ్రేడ్-2 ఈవో పోస్టుల్లో వీరిని భర్తీ చేస్తారు. పదోన్నతి పొందిన వారిలో ఎన్. రంగరాజన్, వి. నాగ కేశవ శేఖర్, జి. లోకేశ్వరరావు, ఆర్‌వీవీఎస్ రామచంద్ర కుమార్, శింగనపల్లి శ్రీనివాస రావు, ఎం. శ్రీనివాసరావు, పి. కృష్ణారెడ్డి, టీవీవీ మోహన్‌రావు, వి. జశ్వంత్ కేదార్, కె. రామచంద్రరావు, వి. ఉషా సంధ్య, పి. రీనా మాధురి, వి. శ్రీనివాసరాజ ఉన్నారు.

బావా బయటకు రా..

స్నేహితుడిని చాకుతో పొడిచి హత్య

క్రైం సమాచారం


హరికృష్ణ (ఫైల్)

ఏలూరు క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'హత్య చేయవద్దు అని వారించిన స్నేహితుడినే అకస్మాత్తుగా కూరగాయలు తరిగే చాకుతో ఒకేఒక్క పోటుపొడిచి హతమార్చిన ఘటన ఏలూరు నగర సమీపంలోని గణేష్‌కాలనీలో శుక్రవారం సాయంత్రం జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాలివి.. ఏలూరు రూరల్ మండలం సాయినగర్ సమీపంలోని గణేష్ కాలనీలో నమ్మి హరికృష్ణ(32) తాపీ పనులు చేస్తూ ఉంటాడు. అతడికి భార్య రాజేశ్వరి, కుమారుడు మహేష్, కుమార్తె కీర్తి ఉన్నారు. రాజేశ్వరి ఏలూరులోని ఒక షాపింగ్ మాల్‌లో సెక్యూరిటీగా పనిచేస్తుంది. కుమారుడు మహేష్ (ఆరో తరగతి) కుమార్తె కీర్తి ఏడో తరగతి చదువుతుంది. హరికృష్ణ చెడు స్నేహం వల్ల గంజాయికి బానిస కావడంతో ఇటీవల పోలీసులకు చిక్కాడు. సత్ప్రవర్తనతో జీవిస్తున్నాడు. అతడి స్నేహితుడైన అదేకాలనీలో నివాసం ఉంటున్న నాయక్ దీపక్ ఏలూరు ఆర్‌ఆర్‌పేటలో ఒక హోటల్‌లో టీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. నాయక్ దీపక్‌కు నాని అనే యువకుడికి గొడవలు ఉన్నాయి. నాని అనే యువకుడు ఒక హత్య కేసులో అరెస్టు కాబడి ఇటీవల బెయిల్‌పై విడుదల అయ్యాడు. నానికి, దీపక్‌కు పాత గొడవలు ఉన్నాయి. నానికి హరికృష్ణకు స్నేహం ఉంది. హరికృష్ణతో దీపక్‌కు స్నేహం ఉంది. నాని తనను చంపివేస్తానని అంటున్నాడని తానే చంపి వేస్తానని అతడు ఎక్కడ ఉన్నాడో చెప్పాలంటూ ఈనెల 6వ తేదీన దీపక్ అడిగి హరికృష్ణతో గొడవ పడ్డాడు. మళ్లీ శుక్రవారం సాయంత్రం హరికృష్ణ ఇంట్లో ఉండగా అతడి కుమారుడు మహేష్ స్నేహితులతో ఆడుకుంటున్న సమయంలో దీపక్ వచ్చి 'బావా బయటకు రా' అంటూ హరికృష్ణను పిలిచాడు. బయటకు వచ్చిన హరికృష్ణను నాని ఎక్కడ ఉన్నాడో చెప్పాలని, తాను చెప్పమన్న సంగతి చెప్పావా అంటూ ప్రశ్నించారు. దీంతో హరికృష్ణ కోపగించుకుని చేతులతో తోశాడు. ఆగ్రహించిన దీపక్ అప్పటికే తనతో తెచ్చుకున్న కూరగాయల చాకుతో ఉదర భాగంలో ఒక పోటు పొడిచాడు. ఆపై నానిని కూడా లేపేస్తానంటూ మరో పెద్ద కత్తిని చేతితో తిప్పుకుంటూ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న హరికృష్ణను ఇరుగు పొరుగు వారు, కుటుంబ సభ్యులు కలిసి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు వచ్చారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.

ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మరోవైపు వన్ టౌన్ సీఐ జి. సత్యనారాయణ, వన్‌టౌన్ ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్, ఏలూరు రూరల్ ఎస్ఐ వి.నాగబాబు వారి సిబ్బంది కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హంతకుడి కోసం గాలింపు చేపట్టారు. ఏలూరు రూరల్ మండలం కొమడవోలులో రాజేష్ అనే యువకుడిని, అతని స్నేహితుడే పాతగొడవలు నేపథ్యంలో ఇంటికి వచ్చి బావా అని బయటకు పిలిచి కత్తులతో నరికి హతమార్చాడు. అదే తరహాలో హత్య చేయడంతో నగరంలో ఈ హత్యలు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి.

ఏడు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ముగ్గురిపై కేసు నమోదు

ఏలూరు నుంచి కాకినాడ పోర్టుకు తరలింపు

నల్లజర్ల, నవంబరు7(ఆంధ్రజ్యోతి):ఏలూరు నుంచి కాకినాడ పోర్టుకు అక్రమంగా తరలిస్తున్న ఏడు టన్నుల రేషన్ బియ్యా న్ని, రెండు వ్యాన్లను విజిలెన్స్ సివిల్ సప్లై అధికారులు శుక్రవారం పట్టుకుని సీజ్ చేశారు. అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద విజిలెన్స్ సీఐ మధుబాబు, సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా రేషన్ బియ్యం బయటపడ్డాయి. బియ్యం తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని గోపాలపురం స్టాక్ పాయింట్‌కు చేర్చి వ్యాన్లను నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆటోలో పోయిన బ్యాగ్..

- గంటల వ్యవధిలో బాధితుడికి అప్పగించిన పోలీసులు

ఏలూరు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న యువకుడు ఆ కంపెనీ పనిమీద ఏలూరు వచ్చి ఆటో ఎక్కాడు. ఆటోలో బ్యాగ్ మర్చిపోయాడు. చివరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టి ఆటో డ్రైవర్‌ను గుర్తించి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని శుక్రవారం రాత్రి ఏలూరుటూటౌన్ సీఐ అశోక్‌కు మార్ బాధితుడికి అప్పగించారు. ముంబైక్ చెందిన కరీమ్ అనే యువకుడు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో పనిచేస్తున్నారు. పెట్రోలు బంకులకు సంబంధించిన పనులపై తరచుగా పలు రాష్ట్రాలు వెళ్తూ ఉంటాడు. దీనిలో భాగంగా ఏలూరు కొత్త బస్టాండ్‌కు వచ్చి అక్కడ నుంచి ఆటోలో ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం సమయంలో ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్దకు వెళ్లాడు. ఆ ఆటోలో బ్యాగ్ మర్చిపోయాడు. అనంతరం ఆటో కోసం ఎంత వెతికినా ఆచూకీ కానరాలేదు. శుక్రవారం ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కె అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ రాము వారి సిబ్బంది కలిసి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఆ బ్యాగ్‌ను గుర్తించారు. ఆటో డ్రైవర్ ఏలూరు వట్లూరుకు చెందిన చాంద్‌బాషా ఆ బ్యాగ్‌ను ఇంట్లో పెట్టుకున్నాడు. అతడిని, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడు కరీమ్‌కు బ్యాగ్ అప్పగించారు. ఆటో డ్రైవర్‌కు కౌన్సెలింగ్ చేశారు.

ఆటో నుంచి మంటలు.. రూ.లక్ష నష్టం

ఏలూరు క్రైం : ఒక షాపింగ్ మాల్ సెల్లార్‌లో పార్కింగ్ చేసిన ఆటో నుంచి అగ్ని ప్రమాదం సంభవించి ఆటోలోని వస్తువులు దగ్ధమయ్యాయి. ఏలూరు పత్తేబాదలో ఉన్న రిలయన్స్ మాల్ సెల్లార్‌లో శుక్రవారం సాయంత్రం ఒక ఆటో పార్క్ చేశారు. ఆ ఆటోలో ఎలక్ట్రికల్ వస్తువులు ఉన్నాయి. ఆటో బ్యాటరీ నుంచి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఏలూరు ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు.

కొత్తముప్పర్రులో బైక్ చోరీ


పెదపాడు, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తన మోటారు సైకిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని పెదపాడు మండలం కొత్తము ప్పర్రు గ్రామానికి చెందిన కోట శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారని ఎస్ఐ కట్టా శారదాసతీష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలి.. ఈనెల 2వ తేదీ రాత్రి 9 గంటలకు తన ఇంటి ఎదురుగా నిలిపివుంచిన మోటారుసైకిల్‌ను ఇంటి ఎదురుగా తాళం వేసి పడుకోగా, మరుసటి రోజు ఉదయం లేచి చూసేసరికి కన్పించలేదని ఫిర్యాదులో పేర్కొ న్నాడు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వైసీపీ నాయకుడి ఆత్మహత్య

తణుకు రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి):గతంలో తణుకు నియోజకవర్గ వైసీపీ యూత్ అధ్యక్షుడిగా వ్యవహరించిన వీరమల్లు ఫణీంద్రకుమార్ (45) గురువారం రాత్రి తణుకులోని ఆయన నివాసంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. మృతుడికి తల్లి, భార్య, ఇద్దరు కుమారులున్నారు. అతడి మృతికి కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఈ మృతిపై తణుకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చినట్లు పోలీసులు తెలిపారు.

గోదావరి స్నానానికి వెళ్లి..

అయ్యప్ప భక్తుడు గల్లంతు


నాగార్జున (ఫైల్)

కుక్కునూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తగూడెం గ్రామానికి చెందిన కుమ్మరపల్లి నాగార్జున(25) అనే అయ్యప్పభక్తుడు గోదావరి స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. అదే గ్రామానికి చెందిన మరో పది మంది అయ్యప్ప దీక్ష మాలధారులతో స్నానానికి వెళ్లాడు. గోదావరిలోకి స్నానానికి దిగడంతో లోతుగా ఉండడంతో మునిగిపోయాడు. వెళ్లిన వారికి ఈత రాకపోవడంతో కాపాడలేని పరిస్థితి ఏర్పడింది. ఈ సమాచారం తెలిసిన వెంటనే సీఐ రమేశ్‌బాబు, వేలేరుపాడు ఎస్ఐ నవీన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఆచూకీ దొరకలేదు. కుమ్మరపల్లి పెదవెంకటేశ్వర్లు, శిరోమణి భార్యభర్తలు కాగా వారికి నలుగురు కుమార్తెలతో పాటు గల్లంతైన నాగార్జున ఏకైక కుమారుడు. వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గోదావరి స్నానానికి వెళ్లే సమయంలో ఇంట్లో కుటుంబసభ్యులు వద్దని వాదించారు. గోదావరి రేవు వద్ద ఓ నాగుపాము పడగ విడిచి వీరికి అడ్డుగా వచ్చింది. అనంతరం పాము పక్కకు వెళ్లిన తరువాత అయ్యప్పస్వాములు గోదావరి స్నానానికి వెళ్లారు. నాగుపాము ఎదురుగా వచ్చి స్నానానికి వెళ్లవద్దని హెచ్చరికపంపినప్పటికి గుర్తించలేకపోయామని అయ్యప్పస్వామి భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


సవాల్ విసిరిన సెల్‌ఫోన్ వీడియోతో నిందితుడిని ప్రశ్నిస్తున్న ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్

పోలీసులకే సవాల్ విసిరిన నేరస్తుడు

- ఐదుగురు నిందితుల అరెస్ట్.. 12 మోటారు సైకిళ్లు స్వాధీనం

ఏలూరుక్రైం:గంజాయి, చెడు వ్యసనాలకు బానిసలైన యువకులు మోటారు సైకిళ్ల తాళాలు పగులగొట్టి వాటిని తస్కరించి వాటితోనే నేరాలు చేస్తున్నారు. అంతేకాకుండా ఏకంగా పోలీసులకే ఒక దొంగ సవాల్ విసిరాడు. 'తాను డ్యూక్ బైక్ తస్కరించానని తనపై రెండు కేసులు ఉన్నాయని వంద బైక్‌లు దొంగతనం చేశానని దమ్ముంటే నన్ను పట్టుకోండి, అని ఏమి చేస్తారో చేసుకోండి' అంటూ సవాల్ విసిరాడు. ఈవిధంగా సవాల్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాలతో నూజివీడు టౌన్ సీఐ పి.సత్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందం ఆ వీడియో ఆధారంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఈనెల 6న నూజీవీడు రామానుగూడెం రోడ్డులో డంపింగ్ యార్డు వద్ద ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

పోలీసులకు సవాల్ విసిరిన నూజివీడు పట్టణంలో రెల్లిపేటకు చెందిన దళాయి గణేష్ అలియాస్ నాగపవన్ గణేష్, నూజివీడులోని గాంధీనగర్‌కు చెందిన షేక్ మెహర్ బాబా, నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన చౌటపల్లి శుభాష్ అలియాస్ సుబ్బు, నూజివీడులోని ఎంఆర్ అప్పారావు కాలనీకి చెందిన షేక్ ఆసిఫ్ ఉల్లా అలియాస్ ఆసీఫ్, చిత్తూరి అజయ్‌కుమార్ అలియాస్ అజయ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి సుమారు రూ.9.08 లక్షల విలువైన 12 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

గణేశ్‌ను ప్రశ్నించిన ఎస్పీ..

ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కిశోర్ అక్కడ ఉన్న నేరస్తుడు దళాయి గణేష్‌ను ప్రశ్నించారు. పోలీసులకు ఏ విధంగా సవాల్ విసిరావో మరోసారి చెప్పు అనగానే గణేష్‌కు చుక్కలు కనిపించాయి. తాగిన మైకంలో మాట్లాడానని తప్పయిందంటూ ఇంకెప్పుడు అలా మాట్లాడనని.. నేరాలు చేయనంటూ ఒప్పుకోలు మొదలు పెట్టాడు. నేరస్తులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులను అభినందించి ప్రశంసా పత్రాలను అందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎన్. సూర్య చంద్రరావు, నూజి వీడు డీఎస్పీ ప్రసాద్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

డ్రోన్లపై విద్యార్థినిలకు అవగాహన

పాలకొల్లు అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం డ్రోన్ సాంకేతికత అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దావోస్ టెక్నాలజీస్ (హైదరాబాద్) మేనేజర్ కోకిలగడ్డ వెంకట్‌రాజు నేతృత్వంలో నలుగురు బృంద సభ్యులు విద్యార్థినీలకు డ్రోన్ పనితీరును ప్రదర్శన పూర్వకంగా వివరించారు. అలాగే భవిష్యత్‌లో డ్రోన్లతో ఉపయోగాలను వివరించి, విద్యార్థినీలకు డ్రోన్ల టేక్‌ఆఫ్, లాండింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

పాలకొల్లు అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీక్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అమలు అవుతున్న నిత్యాన్నదాన పథకం నిర్వాహణకు ఎన్ఆర్‌వి గుప్త లక్ష రూపాయలు విరాళం అందజేశారు. కాగా స్వామివారికి కార్తీక పౌర్ణమి గురువారం రోజున టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ37.488, లడ్డు ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 1710 వెరసి రూ. 39.198లు ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళారోగ్యానికి అధిక ప్రాధాన్యం

తాడేపల్లిగూడెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):మహిళా ఆరోగ్యానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని మెప్మా పీడీ హెప్సిబా అన్నారు. తాడేపల్లిగూడెంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న మెప్మా భవనంలో గురువారం సఖీసురక్ష కింద మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ హెప్సిబా మాట్లాడుతూ ఈ శిబిరంలో మహిళలకు ఉన్న దీర్ఘకాలిక రోగాల పరిస్థితిని అధ్యయనం చేయడంలో భాగంగా స్కానింగ్ టెస్టులు నిర్వహిస్తామన్నారు.కార్యక్రమంలో డాక్టర్ సురేంద్ర, సీఎంఎం సుధాకరరావు, పట్టణ మహిళా సంఘం అధ్యక్షురాలు గుండుమోగుల పద్మప్రియ, జిల్లా పరిశీలకులు నానిబాబు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ



కాళ్ళ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దొడ్డనపూడి గ్రామంలోగురువారం రాత్రి అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుమ్రోగింది. గ్రామంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద నిర్వాహకులు జెట్టిబోయిన తిరుపతిస్వామి, ఆరేటి శ్రీనివాస్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ, రాజేష్ గురుస్వామి భక్త బృందంచే భజన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గురుస్వాములను ఘనంగా సన్మానించారు.

విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ కలిగినప్పుడే వారు పరిపూర్ణత సాధించగలరని తాడేపల్లిగూడెం రూరల్ సీఐ బి.భీమేశ్వర రవికుమార్ పేర్కొన్నారు. కొమ్ముగూడెంలో ఐదు రోజులుగా శశి ఇంజనీరింగ్ కళాశాల నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం శుక్రవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యవివాహాలు, మత్తు పదార్థాల వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. వందేమాతరం పాట 150 సంవత్సరాల సంబరాలు గ్రామ సచివాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ప్రిన్సిపాల్ ఇస్మాయిల్‌లు ఎన్ఎస్ఎస్ క్యాంపునకు సహకరించిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాడేపల్లి బేబి, కార్యదర్శి వాణి, ఉపసర్పంచ్ అబ్బిన గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించాలని వినతి

తాడేపల్లిగూడెం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అనుబంధంగా ఉన్న తాడేపల్లిగూడెం ప్రెస్‌క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించాలని క్లబ్ సభ్యులు, ఐజేయు జాతీయ కార్యదర్శి దూసనపూడి సోమసుందర్‌కు శుక్రవారం జర్నలిస్టులు వినతిపత్రం అందించారు. ఈ ప్రెస్‌క్లబ్‌కు 2023లో ఎన్నికలు నిర్వహించగా ఆ కమిటి పదవికాలం ముగిసిందని అయినా ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఏపీయూడబ్ల్యూజే నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా సోమసుందర్ మాట్లాడుతూ ఈ అంశాన్ని రాష్ట్ర నాయకత్వానికి తెలియచేసి యూనియన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సమాచారం

నేడు టీడీపీ కార్యాలయంలో వినతుల స్వీకరణ

నరసాపురం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ తెలిపారు. టీడీపీ ఇన్‌చార్జి రామరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై ప్రజలు వినతులు అందించవచ్చునన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వర కు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆకివీడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్ళకోడు హౌసింగ్ కాలనీ, అయి-భీమవరం, కుప్పనపూడి గ్రామాలకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నామన్నారు.

భీమవరం టౌన్: శనివారం ఉదయం 8 గంటలనుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. దీని కారణంగా చిన మసీద్, మావుళ్ళమ్మ గుడి వీధి, సర్రాజు వారి స్ట్రీట్, తట వర్తి వారి స్ట్రీట్, రెస్ట్‌హౌస్ రోడ్, వెంకయ్య నాయుడు వారి వీధి, గంగానమ్మ గుడి ఏరియా యనమదుర్రు కాలువ గట్టు, సండే మార్కెట్, భీమేశ్వర స్వామి రోడ్, బ్యాంక్ కాలనీ ఏరియా, సుంకరపద్దయ్య వీధి, శంకర్ మఠం, బుధవారం మార్కెట్ ఏరియా, బస్సు స్టాండ్ ఏరియా, పెద మసీద్ ఏరియాకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కాళ్ల:శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కాళ్ళ, కాళ్ళకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు, దొడ్డనపూడి, కోలనపల్లి, సీసలి, కోమటిగుంట, ప్రాతాళ్ళమెరక, కలవపూడి, పల్లిపాలెం, ఎస్సీ బోస్ కాలనీ, మాలవానితిప్ప, ఆనందపురం గ్రామాలకు, చెరువులు, ఇండస్ట్రీయల్‌కి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

రేపు దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం

తణుకు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 9వ తేదీన కమ్మ కళ్యాణ మండపంలో డాక్టర్ పీఎస్ఎస్ కిరణ్ చారిటిబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంకల్పం పేరుతో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చెర్మన్ సతీష్‌కుమార్ బొల్లా చెప్పారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి సుమారుగా 8వేలమంది దివ్యాంగులు హాజరవుతారని చెప్పారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో కుల, మతాలు రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. ఇందులో భాగంగా 20మంది వైద్యులతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యులు రాసిన మందులను ఉచితంగా దివ్యాంగులకు అందజేస్తామని వివరించారు. ఫౌండేషన్ ప్రతినిధులు షర్మిష్ట వీరన్న, సింహాద్రి కాశీ, గమిని మహిపాల్, వేంద్ర లక్ష్మణ్‌లు మాట్లాడారు.

11 నుంచి సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

ఆకివీడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరుల పెంపుదలపై రెండు రోజులు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు ఉంటాయని ఎంపీడీవో డి.బాబూరావు తెలిపారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఈ నెల 11, 12వ తేదీలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు జరుగుతాయన్నారు.

16న బ్రాహ్మణ కార్తీక వన సమారాధన

భీమవరం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన భీమవరంలో కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు సమాఖ్య అధ్యక్షుడు వేలూరి హనుమ కిరణ్ తెలిపారు. శుక్రవారం భీమవరం విద్యా గణపతి ఆలయంలో వన సమారాధన కరపత్రాన్ని ఆవిష్కరించారు. భీమవరం ప్రకృతి ఆశ్రమంలోని వేగిరాజు లక్ష్మీ కమలాదేవి తోటలో కార్తీక వన సమారాధన జరుగుతోందని, భీమవరం పరిసర ప్రాంత బ్రాహ్మణులంతా పాల్గొనాలని కోరారు.



జువ్వలపాలెంలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు.. తాడేపల్లిగూడెంలో సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి.. భీమవరంలో శ్రీవారి ఆలయ ధర్మకర్తల ప్రమాణ స్వీకారం నిర్వహిస్తున్న దృశ్యం.. చిత్రంలో ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

కాళ్ళ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. జువ్వలపాలెం గ్రామంలో దాత గోకరాజు వెంకట శివరామరాజు సహకారంతో నిర్మించిన ఆయుష్మాన్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చాలాచోట్ల భవనాలు పూర్తి చేయలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న అన్ని భవనాలను పూర్తి చేస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రుల పేరు మీద గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న శివరామరాజు స్ఫూర్తితో మరింత మంది దాతలు ముందుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆరేటి వెంకటరత్న ప్రసాద్, డీసీ చైర్మన్ గోకరాజు శివరామరాజు, నడింపల్లి విశ్వనాథ రాజు, మంతెన పెద నరసింహరాజు, ఎంపీడీవో జి.స్వాతి, తహసీల్దార్ జి.సుందర్‌సింగ్, పీహెచ్‌సీ డాక్టర్ సీహెచ్.రంగంనాయుడు పాల్గొన్నారు.

స్టేట్ హైవే పనుల పరిశీలన

కాళ్ళ మండల పరిధిలోని రాష్ట్రీయ రహదారి మరమ్మతు పనులను డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అధికారులు, స్థానికులతో కలిసి జక్కరం గ్రామం వద్ద శుక్రవారం పరిశీలించారు. పెద అమిరం నుంచి ఏలూరుపాడు వరకు సుమారు 15 కి.మీ. పొడవున ఉన్న ఈ రాష్ట్రీయ రహదారి పెద్ద పెద్ద గుంతలు పడి ఇటీవల వర్షాలకు ప్రమాదకరంగా మారింది. గుంతలను 'పీ4 స్ఫూర్తి'తో పూడుస్తున్నట్లు ఆయన తెలిపారు. పనులను మరో ఐదు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

భీమవరం టౌన్: ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనానికి సేంద్రియ ఉత్పత్తుల వినియోగం ఎంతో మేలు చేస్తాయని ఉపసభాపతి కనుమూరు రఘురామ కృష్ణ రాజు అన్నారు. శుక్రవారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో భీమవరం పీపీ రోడ్డు విస్సాకోడేరు వంతెన డౌన్‌లో ఏర్పాటు చేసిన సేంద్రియ ఉత్పత్తుల అంగడిని ఉప సభాపతి కనుమూరి రఘురామ కృష్ణరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సంయుక్తంగా ప్రారంభించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

తాడేపల్లిగూడెం, నవంబరు 7(ఆంధ్ర జ్యోతి): తాడేపల్లిగూడెం నియోజకవర్గం పరిధిలోని పలువురికి శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి, జనసేన నాయకులు పుల్లా బాబి, నీలపాల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ ధర్మకర్తల ప్రమాణ స్వీకారం

భీమవరంటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):జువ్వలపాలెం రోడ్డులోని శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశా రు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అంజిబాబు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏఎంసి మాజీ చైర్మన్ ఇందుకూరి రామలింగరాజు తదితరులు పాల్గొ న్నారు. ముందుగా ఆలయ ఛైర్మన్‌గా వంశపారంపర్య ధర్మకర్త మంతెన రామ్ కుమార్ రాజు, సభ్యులుగా వేలూరి సుబ్రహ్మణ్యశర్మ, వీరమల్లు శ్యామలవతి, కొలిపాకుల దుర్గాప్రసాద్, మల్లు వలస వెంకట లక్ష్మి, ఇంటి నాగలక్ష్మీ మేడూరి సత్యనారాయణ, ఉప్పలపాటి సత్యనారాయణ రాజు, వెంకట రమణ, ఎం.కాశీ విశ్వనాధరాజు, బండి రాణి ప్రమాణ స్వీకారం చేశారు.

భారతీయుల ఏకత్వానికి ప్రతీక వందేమాతరం

ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో వందేమాతరం గీతాలాపన.. ప్రదర్శనలు



నరసాపురంలో వందేమాతరం గీతాన్ని అలపిస్తున్న డీఎస్పీ శ్రీవేద, విద్యార్థులు

కాళ్ళ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారతదేశం మొత్తాన్ని ప్రభావితం చేస్తూ ఏకం చేసిన గేయం వందేమాతరం అని, దీనిని రచించిన బంకిం చంద్ర చటర్జీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. వందేమాతరం గీతం రాసి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం జువ్వలపాలెంలో ప్రత్యేక సమావేశం జరిగింది. కూటమి నాయకులు, అధికారులతో కలిసి ఆయన వందేమాతరం గేయాన్ని ఆలపించారు.

తణుకు: వందేమాతం గీతం భారత స్వాతంత్ర్య పోరాటంలో ఉద్యమ గీతంగా నిలించిందని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ యు. లక్ష్మీసుందరీభాయి అన్నారు. శుక్రవారం కళాశాలలో వందేమాతర వేడుకలు నిర్వహించారు. బాలురున్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు జాతీయ జెండాలు చేతపట్టుకుని వందేమాతర గీతం ఆలపించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. శ్రీతారకాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు వావిలాల వెంకట పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సిద్ధార్థ కాలేజీలో విద్యార్థులతో జాతీయ గీతం ఆలపించారు. వావిలాలల సరళాదేవి, సభ్యులు శ్యామల, బత్తుల వెంకట రమణ, జ్యోతి పాల్గొన్నారు.

పెనుగొండ:పెనుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేడుకగా వందేమాతరం గీతాలాపన నిర్వహించారు. సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి పాల్గొన్నారు. అదేవిధంగా ఎస్‌వీకేపీ అండ్‌ఎస్‌కె వీఆర్ గరల్స్ హైస్కూలులో వేడుకగా నిర్వహించారు.

నరసాపురంటౌన్: దేశభక్తి ప్రతి ఒక్కరిలో ఉండాలని డీఎస్పీ శ్రీవేద అన్నారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయం వద్ద విద్యార్థులతో కలిసి ఆమె వందేమాతరం గీతాన్ని అలపించారు. ఇటు సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల వద్ద గీతాన్ని ఆలపించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణ, ఎస్సైలు ముత్యాలరావు, జయలక్ష్మి, ఎంఈవో పుష్పరాజ్యం పాల్గొన్నారు.

మొగల్తూరు:మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లోనూ ఘనంగా వేడుకలు నిర్వహించారు. వందేమాతరం గేయ రచయిత బకిం చంద్ర చటర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు: జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల, నగర పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాలు, ఎస్సీ బాలురు వసతి గృహం తదితర చోట్ల వందేమాతర గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ జగదీశ్వర రావు, నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్, తహసీల్దార్ పరుఖ్ తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు:వేండ్ర జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వందేమాతర గేయాన్ని ఆలపించి తమ దేశభక్తిని చాటారు. విద్యార్థులు, విద్యా కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: వాసవి జీఎంఆర్ కళాశాలలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దువ్వ శ్రీను అధ్యక్షతన వందేమాతరం 150 సంవత్సరాల పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ఈతకోట తాతాజి, కళాశాల ప్రిన్సిపాల్ జీవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: దేశ స్వాతంత పోరాటంలో వందేమాతరం గీతం కీలక పాత్ర పోషించిందని రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో వందేమాతరం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డీన్‌లు కే.హిమబిందు, ఆచార్యులు ఎన్.జయరాం, రాజేశ్వరరెడ్డి, డాక్టర్ శారదాప్రసన్న మాలిక్, అసోసియేట్ డీన్‌లు శీనివాసన్, డాక్టర్ కిరణ్ తీపర్తి తదితరులు పాల్గొన్నారు

అత్తిలి: అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.శామ్యూల్ ఆధ్వర్యంలో వందేమాతరం వేడుకలు నిర్వహించారు. ఎస్‌విఎస్ఎస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యార్థులు వందేమాతరం గీతాలాపన చేశారు. కళాశాల పాలకవర్గ కార్యదర్శి మద్దాల వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ పమ్మి శ్రీరామశర్మ, డీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

భీమవరం టౌన్: స్వాతంత్ర్యోద్యమంలో వందేమాతరం ఒక స్ఫూర్తి వంతమైన రణ నినాదమని టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, ఎంఈవో జి.శ్రీనివాస్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న వందేమాతరం రచించి 150 ఏళ్ల ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద నిర్వహించారు.

పాలకొల్లు అర్బన్/టౌన్: వీవర్స్ కాలనీలోని మున్సిపల్ ఎలిమెంట్రీ స్కూల్ విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఛాంబర్స్ విద్యా సంస్థలు, ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బ్రాడీపేటలోని అల్లు వెంకట సత్యనారాయణ మున్సిపల్ హైస్కూల్లో బీజేపీ నాయకులు విద్యార్థులతో కలిసి వందే మాతర గేయాన్ని ఆలపించారు.

తెలుగు మహాసభలకు సమన్వయకర్తగా రమావతి



తాడేపల్లిగూడెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):2026లో నిర్వహించే 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు సమన్వయకర్తగా తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన కొల్లి రమావతిని నియమించారు. ఈ మేరకు ఆమెకు శుక్రవారం నియామక పత్రం అందింది. ఈ సందర్భంగా కొల్లి రమావతి మాట్లాడుతూ 3వ ప్రపంచ తెలుగు మహాసభలు 2026 జనవరి 3, 4,5 తేదీల్లో గుంటూరులో నిర్వహిస్తారన్నారు. ఈ మహాసభలకు దేశ, విదేశాల నుంచి విచ్చేసే తెలుగు ప్రతినిధులు, చలనచిత్ర, సాహిత్య రంగాల్లో ప్రముఖులు పాల్గొంటారన్నారు.

ఉచిత పశువైద్య పరీక్షలు

కాళ్ళ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పశు వైద్యశాలల్లో పెయ్య దూడ పుట్టించే వీర్యం అందుబాటులో ఉందని పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ ఎల్కే సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఏలూరుపాడులో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటే పాల దిగుబడిని పెంచుకోవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పాడి రైతులకు, రైతులకు నట్టల నివారణ మందులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి జాఫర్ హుస్సేన్, సహాయ సంచాలకులు డాక్టర్ మల్లేశ్వరరావు, పశు వైద్యాధికారి కెల్లా భార్గవి సత్య, ఎంపీటీసీ సీహెచ్.రాంబాబు, మంతెన రవివర్మ, వక్కపట్ల హరిబాబు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

గణపవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పీఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో సరిపల్లె సాయిబాబా భవనంలో మండల పీఎంపీల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన క్యాన్సర్‌పై అవగాహన, కార్తీకవనసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ పీఎస్ఆర్ అవినాష్, డాక్టర్ శ్రీజా మాట్లాడుతూ మహిళలకు రొమ్ముక్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం వనసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పీఎంపీల నాయకులు ఏఆర్‌కే.పరమేశ్వర్లు, జయరామ్, ఎన్.జయసూర్య, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకరరావు పాల్గొన్నారు.

అన్నసమారాధన

నరసాపురం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 7వ వార్డులో పుంతల ముసలమ్మ అమ్మవారి అఖండ అన్నసమారాధన శుక్రవారం నిర్వహించారు. టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈసమారాధనలో 2వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాలు స్వీకరించారు. కొవ్వలి ట్రస్టు అధ్యక్షులు నిమ్మకాయల నీలమ, గోపాలరావు, కొండా శ్రీధర్, జయలక్ష్మి దంపతులు సమారాధనను ప్రారంభించారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ

ఆకివీడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా టీడీపీ పని చేస్తుందని పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా అన్నారు. పార్టీ సీనియర్ కార్యకర్త బొక్కిన అప్పారావు భార్య సూర్యకాంతంకు శుక్రవారం రూ.4వేల నగదు, బియ్యం, నూనె, కూరగాయలు అందచేసి మాట్లాడారు. అప్పారావు ఇటీవల మరణించడంతో అతను భార్యకు సహాయం చేశారు.

గ్రామాల్లో బీసీ జెండాలు ఎగరాలి

తణుకు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని నియోజవర్గాల్లో కమిటీలు వేసి గ్రామ గ్రామాన బీసీ సంక్షేమ సంక్షేమ సంఘం జెండాలు ఎగిరేలా కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు అన్నారు. శుక్రవారం బీసీ సంఘ నాయకులు దొమ్మేటి వెంకట సుధాకర్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల హక్కుల సాధనకు పోరాడుతునే ఉన్నామని చెప్పారు. తణుకు నియోజకవర్గస్థాయిలో ఉద్యమ కార్యాచరణ రూపొందించుకుని పోరాటాలకు సిద్ధపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు దొమ్మేటి వెంకట సుధాకర్, వావిలాల సరళాదేవి, కడియాల సూర్యనారాయణ, తమరాపు సత్యనారాయణ, కౌరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు కృషి చేయాలి

తణుకు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): దోమలు నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఇరగవరం రోడ్డు వార్డు సచివాలయం ప్రాంతంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ర్యాలీ నిర్వహించి దోమల నివారణకు చేపట్టే చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో వార్డు సెక్రటరీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కల్పించాలి

మొగల్తూరు, నవంబరు7(ఆంధ్రజ్యోతి):బాల్య వివాహల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బాలల రక్షణాధికారి బి.నహమ్య సూచించారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించిన బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విదేశాలకు జీవనోపాధికై వెళ్లిన తల్లులు తమ పిల్లలకు, మధ్యలో చదువు మానేసిన విద్యార్థులకు బాల్య వివాహల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో బి.ఊర్మిళ, సూపర్‌వైజర్లు విజయకుమారి, శ్రీదేవి పాల్గొన్నారు.

గురుస్వామికి సత్కారం

మొగల్తూరు, నవంబరు7(ఆంధ్రజ్యోతి):కేపీపాలెం సౌత్ ఎంపీటీసీ సభ్యుడు అందే ముక్తేశ్వరరావు (దొరబాబు) 18వసారి శబరిమలై యాత్రకు వెళుతున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆయన నివాసం వద్ద స్వామివారికి విశేష పూజలు, కలశపూజలు, ప్రత్యేక పూజా, భజన కార్యక్రమాలు నిర్వహించి అనంతరం భక్తులకు బిక్షను అందజేశారు. ఈ గురుమహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురుస్వామి దొరబాబుకు గురు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు గురుస్వామిని శాలువ కప్పి సత్కరించారు.


రష్యా విప్లవ స్ఫూర్తితో పోరాటం చేయాలి



మాట్లాడుతున్న డీవీవీఎస్ వర్మ

తణుకు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలో మెజార్టీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే రష్యా విప్లవ పోరాట స్ఫూర్తితో పోరాటం చేయాలని దారి దీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ అన్నారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో రష్యా విప్లవ వార్షికోత్సవ సభ జరిగింది. సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీవీ.ప్రతాప్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ చంద్రబాబు, డి.సీతారామయ్య మాట్లాడుతూ రష్యాలో జరిగిన విప్లవం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఎన్నో హక్కులు కోసం పోరాటాలు సాగించారని చెప్పారు. ముందుగా కామ్రేడ్ చింతకాయల బాబురావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో రాజ్యాంగ వేదిక నాయకురాలు సంకు మనోరమ, నాగరత్నం, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి సర్కారుతో గ్రామాలకు మంచిరోజులు



డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు కూటమి ప్రభుత్వంతోనే మంచిరోజులు వచ్చాయని సర్పంచ్ బేదపూడి వెంకట సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. కృష్ణాయపాలెంలో జడ్పీ నిధులు రూ.5లక్షలతో సీసీ రోడ్డు, రూ.5లక్షలతో సీసీ డ్రెయినేజీ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బేదపూడి వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజాశ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆచంటలో జోరువాన....

ఆచంట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ అనంతరం వాతావరణం గంటకో రకంగా ఉంటుంది. కొంత సేపు ఎండ.. మరి కొంత సేపు మబ్బులు, మేఘాలు, మరికొంత సేపు వర్షం పడుతుంది. ఆచంటలో మధ్యాహ్నం గంట సేపు జోరువాన కురిసింది. అయితే మరలా వాతావరణం ఆగి పొడిగా ఉంది. ఇటీవల వర్షాలు పడుతున్నా వాతావరణం మాత్రం వేడి తగ్గక ఉక్కబోతతోనే ఉంటుంది.

రైతులకు బాసటగా నిలవండి

పెంటపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : కష్టాలలో ఉన్న రైతులకు వరి కోత యంత్రాల ఏజెంట్‌లు బాసట గా నిలవాలని ఏడీఏ అర్.గం గాధర్‌రావు, ఏవో చీర్ల రవి కుమార్ అన్నారు. శుక్రవారం అలంపురం సొసైటీలో వరికోత యంత్రాల ఏజెంట్‌లతో సొసైటీ ఛైర్మన్ పారిచర్ల ప్రసాద్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో మొత్తం 23 వేల ఎకరాలలో వరిసాగు చేపట్టగా వాటిలో 17 వేల ఎకరాలలో రైతులు స్వర్ణరకం వేశారని, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా సుమారు 5 వేల ఎకరాలలో చేలు పడిపోయాయన్నారు. సర్పంచ్ తాతపూడి ప్రగతి, ములగాల శివ, పాతూరి రాంప్రసాద్‌చౌదరి, బుద్దన ధనరాజు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి

మొగల్తూరు, నవంబరు7(ఆంధ్రజ్యోతి):వెంప గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందేలపై శుక్రవారం మొగల్తూరు పోలీసులు దాడి చేశారు. ఈదాడిలో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి ఐదు కోడి పుంజులు, రూ.8,100 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్యం ఆదాయం కోసం, కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం కల్తీ మద్యాన్ని ప్రభుత్వం వరదలా పారిస్తున్నదని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి ఆరోపించారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం భీమవరం ఎక్సయిజ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఎస్ఐ సునీల్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ కల్తీ మద్యానికి గీత వృత్తిని బలి చేయవద్దని, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా గీత వృత్తిని ఆధునీకరించాలని, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు